

# 6. లోభం

సుడిగాలిలా లోపలికి వచ్చింది శ్రీగౌరి, "ఏంటింకా తయారవలేదా!" అంటూ.

చదువుతున్న పుస్తకం అలమరలో పెట్టి లేచి నిల్చున్నాను. "తయారే. పద వెళ్దాం." అన్నాను.

అది చెప్పిన టైం పది. ఇపుడింకా తొమ్మిదిన్నరే అయింది. దాని సంగతి నాకు తెలుసు కాబట్టి నేను తొమ్మిదికే తయారయి పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాను.

నేను యింటికి తాళం పెట్టి వచ్చే లోపలే హడావుడిగా వెళ్ళి కార్లో కూర్చుని, వాణి వాళ్ళ యింటికి డైరెక్షన్స్ చెప్తోంది డ్రైవర్‌కి.

మేము వెళ్ళేసరికి వాణి కూడా రెడీగానే వుంది. "రా. రా. త్వరగా రా." అంది గౌరి కారు దిగకుండానే.

వాణి కారు దగ్గరగా వచ్చి "అమ్మ చిక్కడపల్లిలో పిన్ని వాళ్ళింటికి వెళ్తానంటోందే. మనం వెళ్తూ వెళ్తూ అమ్మని అక్కడ దింపి వెళ్దామా!" అని అడిగింది.

గౌరి తల వూపింది. వాణి మళ్ళీ గుమ్మం దగ్గరికి వెళ్ళి "అమ్మా! త్వరగా రా!" అని కేక పెట్టింది.

నేను, గౌరి, వాణి – మేం ముగ్గురం స్నేహితులమెలా అయ్యామా అనిపిస్తుంది నాకు. మా భావాలు, ఆలోచనాస్థాయిలలో చాలాతేడాలున్నాయి. ముఖ్యంగా గౌరికీ, నాకూ.

ఏ విషయం తీసుకున్నా, మా యిద్దరి అభిప్రాయాలూ తూర్పు పడమరగా వుంటాయి. దాని దృష్టిలో నావి మూర్ఖపు ఆలోచనలు. నా దృష్టిలో దానివి వక్రమార్గం పట్టిన భావాలు. వాణికి అంత బలమైన అభిప్రాయాలు లేవు. నేను మాట్లాడినపుడు నా మాటలతో ఏకీభవిస్తుంది. గౌరి మాట్లాడినపుడు అది చెప్పేదీ కరెక్టేననుకుంటుంది.

అయితే ఒక విషయం. నా ఆలోచనలని మూర్ఖంగా భావించినా, నా తెలివితేటలనీ, విశ్లేషణనీ గౌరవిస్తుంది గౌరి.

నేనూ తనని పూర్తిగా అర్థం చేసుకున్నాను. అందుకే ఈ అభిప్రాయ భేదాలు మా స్నేహానికి ఆటంకం కాలేదు.

అయిదు నిమిషాలయినా వాణి వాళ్ళ అమ్మగారు రాలేదు. గౌరి అసహనం నాకర్థమవుతోంది. దానికి సమయం ఎంతమాత్రం వృథా కాకూడదు. ప్రతీ పనీ అనుకున్నది అనుకున్నట్లుగా అయిపోవాలి. పదిరూపాయలు యివ్వాల్సిన చోట వంద రూపాయిలైనా యిచ్చి పని పూర్తి చేసుకుంటుంది. మళ్ళీ వందరూపాయిలొచ్చేచోట చాకచక్యంగా వేయి రూపాయిలు సంపాదించుకుంటుంది.

నేనూ, వాణీ అలా కాదు. పదిరూపాయిలు ఖర్చుపెట్టాల్సిన చోట సరిగ్గా ఆ పదిరూపాయిలే ఖర్చు పెడతాం. అంతకన్నా ఎక్కువ పెట్టాల్సి వస్తే "అక్కర్లేదులే" అని యివతలికి వస్తాం. ఆ కోరికని వదిలేసుకుంటాం.

ఈ ధోరణి చూస్తే గౌరికి ఎగతాళి అని నాకు తెలుసు. నేరుగా నన్నేమీ అనదు. కానీ యిలాంటి ధోరణి వున్నవారిని వెక్కిరిస్తూ అభిప్రాయాలు వెలిబుచ్చుతుంది. సమయాన్ని మిగుల్చుకునేందుకు డబ్బు కొంచెం ఎక్కువగా ఖర్చుపెట్టినా తప్పు లేదని ఉపదేశిస్తుంది. టైమే మనీ అని గ్రహించలేని వాళ్ళనీ, టైమ్‌ని మనీగా మార్చుకోలేని వాళ్ళనీ చూసి జాలిపడుతుంది.

మొత్తానికి వాణి వాళ్ళ అమ్మగారు వచ్చారు. గౌరి ముందు సీట్లో కూర్చుంటే, మేం ముగ్గురం వెనుక సీట్లో కూర్చున్నాం. ఆవిడని చిక్కడపల్లిలో దింపి, మేము రిసార్ట్ వైపు బయల్దేరాం.

ఊరికి కాస్త దూరంగా వున్న ఒక టౌన్‌షిప్‌లో గౌరి ప్లాట్ కొనుక్కుంది. అక్కడ ప్లాట్స్ కొన్నవాళ్ళందరికీ ఆ రిసార్ట్‌లో మెంబర్షిప్పూ, డిస్కౌంట్లూ వుంటాయి. ఒకరోజంతా సరదాగా అక్కడ గడిపి వద్దామని బయల్దేరాం ముగ్గురం.

"వసంతని కూడా రమ్మంటే వచ్చేదేమో!" అంది వాణి.

"దానికెపుడూ ఇంట్లో సమస్యలే కదా!" అంది గౌరి.

"అవును. వాళ్ళ ఆయన యిరవై నాలుగు గంటలూ సాధించి చంపేస్తాడు. అది ప్రక్కింటి వాళ్ళతో మాట్లాడటం కూడా ఆయనకి యిష్టం వుండదు."

"అవును. నేనూ అందుకే వూరుకున్నాను. మనం యిలా వెళ్తున్నామని తెలిస్తే మనతో రాలేకా... రాకుండా వుండలేక బాధపడుతుంది అది." అన్నాను నేను.

ఒక్క నిమిషం ఎవరూ మాట్లాడలేదు.

"ఫోనులో మాట్లాడుతూండడం.. వీలున్నపుడల్లా మనమే దాని దగ్గరికి వెళ్ళడం.. అంతే మనం దానికి చేయగలిగింది" వాణి నిట్టూర్చింది.

"ఫోన్‌లో అయినా ఏం మాట్లాడతాం! ఒక సమయమూ సందర్భమూ లేకుండా, ఎప్పుడంటే అప్పుడు చేస్తే మాట్లాడలేం కదా! ఆ మధ్య ఒకసారి రాత్రి పదింటపుడు చేసింది. ఒకటే ఏడుపు. చచ్చిపోవాలనిపిస్తోంది అంటుంది." గౌరి విసుగు ధ్వనించే కంఠంతో చెప్పింది.

"అవునా! ఎందుకు? ఏమయిందిట?" వాణి కంగారుగా అడిగింది.

"ఏమో తెలీదు. ఆమర్నాడు పొద్దున్నే ఢిల్లీ వెళ్ళాల్సిన పనుంటే అన్నీ సర్దుకుంటున్నాను నేను. దానితో మాట్లాడుతూ కూర్చుంటే కష్టమని ప్రొద్దున్నే మాట్లాడదాం లే పడుకో అని చెప్పి ఫోన్ పెట్టేశాను."

"తర్వాత మాట్లాడావా మళ్ళీ!" వాణి హతాశురాలయినట్లుగా అడిగింది.

"లేదు, కుదర్లేదు" అంది గౌరి.

వాణి నిర్ఘాంతపోయి చూస్తుంటే "కంగారు పడకు. నేను మాట్లాడానులే" అన్నాను నేను.

"ఎప్పుడు!"

"ఆరోజే. గౌరితో మాట్లాడిన తర్వాత నాకు చేసింది. అసలు ముందు నాకే చేసిందట. నా ఫోన్ బిజీగా వుందని గౌరితో మాట్లాడిందట."

"అసలేమయిందట! అడిగావా!" వాణి ఆదుర్దాగా అడిగింది.

"ఏం లేదులే. వాళ్ళ ఆయన గురించే. కాసేపు మాట్లాడాక తనంతట తనే తేరుకుందిలే." అన్నాను వాణిని సమాధానపరుస్తూ.

"అలా అపుడపుడూ ఫోన్ చేస్తూంటుందా నీకు!" గౌరి అడిగింది.

"ఎప్పుడైనా!" అన్నాను.

"ఊ." అంది గౌరి నిట్టూరుస్తూ. "మరీ అలా అలవాటు చేయకు. ఇలా చెప్పడం నాకూ బాధగానే వుంది. కానీ మన సమయమూ విలువైనది కదా!" అంది.

"విలువైన దాన్ని దాచుకోవడం ఒక పద్ధతి. అవసరమైన వారికి పంచడం ద్వారా ఆ విలువని పెంచడం మరో పద్ధతి." అన్నాను నేను నవ్వుతూ.

గౌరి చటుక్కున వెనక్కి తిరిగింది. నా కళ్ళల్లోకి ఒక్క క్షణం చురుగ్గా చూసి, మళ్ళీ మొహం తిప్పుకుని "ఎన్నాళ్ళు పంచుతావ్? ఎప్పటికైనా దాని ప్రాబ్లం అదే సాల్వ్ చేసుకోవాలి కదా!" అంది.

నేను మాట్లాడలేదు.

ఊరి చివరనున్న పల్లెటూరి మీదుగా వెళ్తోంది కారు. ఇరుకు వీధులలో నుంచి కారు మెల్లగా వెళ్తుంటే.... ఒక యింటి వాకిట్లో తాపీగా కబుర్లు చెప్పుకుంటూ సరుకులు బాగుచేసుకుంటూన్న ఆడవాళ్ళు కనిపించారు.

"ఎంతెంత టైమూ యిలా వృథా చేసేస్తారు వీళ్ళు. అందుకే ఎదుగూ బొదుగూ వుండదు. అదే నగరాలలో అయితే చిన్నపిల్లలకి కూడా టైం మేనేజిమెంటూ, దాని ఇంపార్టెన్సూ తెలుస్తుంది" అంది గౌరి.

"సరేలే, మా యింటి ప్రక్కన మేడమీద రూంలో నలుగురు కాలేజ్ పిల్లలుంటారు. ఏరోజూ ప్రొద్దున ఎనిమిదింటిలోపల నిద్ర లేవరు. ఆదివారాలయితే పన్నెండింటపుడు బ్రష్షులు నోట్లో పెట్టుకుని బాల్కనీలో తిరుగుతూ వుంటారు." వాణి చిరాగ్గా చెప్పింది.

ఆ విషయం మీద యిద్దరూ కాసేపు వాదించుకున్నారు.

నగర జీవితంలో సమయానికి విలువ ఎక్కువ అనే మాటని వాణి ఎందుకో ఒప్పుకోలేకపోతోంది. అతికీ అతకని ఉదాహరణలతో ఏదో చెప్పే ప్రయత్నం చేస్తోంది. గౌరి వాటన్నిటినీ తన వాదనలతో ఖండించి పారేస్తోంది.

మధ్యలో వాణి అసహాయంగా నావైపు చూసింది కానీ నేనేమీ మాట్లాడలేదు.

ఈ వాదన కొత్త కాదు. గౌరి ఎప్పుడూ మాట్లాడే మాటలే యివి. అమెరికా వెళ్ళొచ్చిన కొత్తలో ఈ ధోరణి మరీ ఎక్కువగా వుండేది.

"కడిగిందే కడిగీ, తుడిచిందే తుడిచీ చాదస్తంగా ప్రవర్తిస్తారు మనవాళ్ళు. పని సులువుగా చేసుకోవడం తెలీదు" అనేది. మార్కెట్లోకి ఇన్ని రకాల సాధనాలొచ్చినా కనీసం వాషింగ్ మెషీన్ అయినా కొనుక్కోని వాళ్ళని చూసి 'ఎంత మూర్ఖులు!' అని ముక్కున వేలేసుకునేది.

వాళ్ళ వాదన పూర్తి కాకముందే గమ్యం చేరాం. గౌరి వెళ్ళి అక్కడి స్టాఫ్‌తో మాట్లాడుతూంటే మేమిద్దరం అందంగా పెంచిన చెట్లని చూస్తూ నిల్చున్నాం. "ఏంటే! నువ్వసలు ఏమీ మాట్లాడటం లేదు!" అంది వాణి.

"మీమాటలు వింటున్నాను" అన్నాను.

గౌరి వచ్చి, "ముందు కాస్త కాఫీ త్రాగుదాం. తర్వాత ఇక్కడ ఒక చిన్న శివాలయం వుంది. అది చూద్దాం. ఆతర్వాత ఇక్కడ వీళ్ళు రెండు మూడు రకాల గార్డెన్స్ పెంచుతున్నారు. అవి కూడా చూద్దాం. బాగుంటాయి. మధ్యలో వీలయినపుడు వచ్చి లంచ్ చేద్దాం." అంటూ ప్రోగ్రాం వివరించింది.

"వీలయినపుడు కాదు, ఆకలేసినపుడు." వాణి చివరివాక్యాన్ని సరిదిద్దింది.

"అదేలే" అంటూ ముగ్గురం నవ్వుకున్నాం.

కాఫీ త్రాగాక గుడివైపు నడుస్తుంటే.... "ఇంతకీ నువ్వు నీ అభిప్రాయం చెప్పలేదు!" అంది వాణి నావైపు చూస్తూ.

"దేని గురించి?" అంది గౌరి.

"అదే, ఇందాక కార్లో మనిద్దరం మాట్లాడుకున్న విషయం." అంది వాణి.

"ఇంకా నీకు అనుమానం తీరలేదా!" గౌరి ఆశ్చర్యంగా అడిగింది. "డెఫినెట్‌గా పల్లెటూర్లలో కంటే పట్టణాలలో తక్కువ సమయంలో పని పూర్తిచేసుకుంటారు. పట్టణాలలో దొరికినన్ని సాధనాలు పల్లెటూర్లలో దొరకవనీ, దొరికినా అందరూ వాడరనీ ఎవరైనా ఒప్పుకోవలసిందే కదా!" అంది.

నిజమేనన్నట్లుగా తల వూపాను నేను.

వాణి చిన్నబుచ్చుకుంటే, గౌరి విజయగర్వంతో నవ్వి, "నువ్వు మీప్రక్కింటబ్బాయిల గురించీ, ఎదురింటబ్బాయిల గురించీ మాట్లాడకు. జనరల్‌గా చూస్తే... మనం ఎక్కువ సమయాన్ని మిగుల్చుకుంటాం. ఊర్లలో వాళ్ళకన్నా మనం టైంని బాగా మేనేజ్ చేసుకుంటాం." అంది.

"మిగుల్చుకోవడం వేరు. మానేజ్ చేసుకోవడం వేరు." అన్నాను నేను.

"అంటే!?" అంది గౌరి.

"మిగుల్చుకోవడమంటే మిగుల్చుకోవడం. మానేజ్ చేసుకోవడం అంటే ఆ మిగుల్చుకున్న దాన్ని సద్వినియోగం చేసుకోవడం."

వాణి చటుక్కున నా చేయి పట్టుకుంది. అర్థమయ్యీ కానట్లున్న విషయాన్ని పట్టుకోవడానికి ప్రయత్నిస్తూన్న వుద్వేగం కనబడింది దాని మొహంలో.

గౌరి మాత్రం "అసలంటూ మిగుల్చుకుంటే కదా సద్వినియోగమైనా, దుర్వినియోగమైనా చేసేందుకు వీలయ్యేది!" అంటూ సంభాషణని కట్ చేసి గుడి మెట్లు ఎక్కసాగింది.

శివుడి దర్శనం చేసుకుని, గుడి దగ్గరే కాసేపు కూర్చున్నాం. అలా ఎత్తులో కూర్చుని చుట్టూ వున్న పల్లెల్నీ, పొలాలనీ చూస్తుంటే చాలా ఆహ్లాదంగా అనిపించింది.

క్రిందకి వచ్చి లంచ్ చేశాం. గౌరి వాళ్ళ ఫ్లాట్ చూశాం. అక్కడున్న గార్డెన్స్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకున్నాం.

మూడున్నర అవుతూండగా "ఇక బయల్దేరదామే!" అంది గౌరి.

కాఫీలు త్రాగి కారెక్కాం. ప్రొద్దున చూసిన పల్లె దగ్గరికి రాగానే.... "ఇక్కడ దిగి కాసేపు నడుద్దామే!" అంది వాణి.

ఏ కళనుందో! గౌరి సరేనంది.

ముగ్గురం కారు దిగి మెల్లగా నడవసాగాం. అక్కడొక యిల్లు, అక్కడొక యిల్లు, విసిరేసినట్లుగా వున్నాయి. మధ్యలో పొలాలు, తోటలు.

కాస్త దూరంగా ఓ యింటి ముందు, ఒకావిడ నీళ్ళు చల్లి ముగ్గేస్తూ కనబడింది. పదడుగుల దూరం నుంచే అర్థమయింది అది రథం ముగ్గని.

"ఇదేమిటి! ఇప్పుడు రథం ముగ్గేస్తోందీవిడ! సంక్రాంతికి కదా వేస్తారు!" అంది గౌరి.

"అవును, ఇదేమిటి!?" వాణి కూడా ఆశ్చర్యపోయింది.

"రథసప్తమికి కూడా వేస్తారనుకుంటా" అంది మళ్ళీ తనే.

"ఇవాళ రథసప్తమా!" గౌరి ఎగతాళిగా అడిగింది. "రథసప్తమి కూడా సంక్రాంతికి దగ్గర్లోనే వస్తుందే పిచ్చిమొహమా!" అంది.

"అవున్లే, కానీ ఇంకేదన్నా పండగకి కూడా వేస్తారేమో!" వాణి నసిగింది. "ఏదన్నా సూర్యుడికి సంబంధించిన పూజో, వ్రతమో చేసేటపుడు వేస్తారేమో!"

"సూర్యుడికి సంబంధించిన వ్రతం సాయంత్రంపూట సూర్యుడు వెళ్ళి పోతూన్నపుడు చేస్తారా!" గౌరి మళ్ళీ ఖండించింది.

మేము ఆ పది అడుగుల దూరం నడిచే లోపల ఇలా పది రకాల ఆలోచనలు చేశారు ఇద్దరూ.

అంతలో హఠాత్తుగా అటువైపు నుంచి గడ్డిమోపు నెత్తిన పెట్టుకుని వస్తున్న ఒక యువతి కనిపించింది. ఆమె కూడా అటువైపు పదడుగుల దూరంలోనే వుంది. కానీ ఆ పదడుగుల దూరాన్నీ ఒక్క క్షణంలో కవర్ చేస్తూ నడిచివచ్చింది.

వయ్యారంగా గడ్డి మోపుని బ్యాలెన్స్ చేసుకుంటూ, అదే వేగంతో ఆ యింటి ముందు నుంచి సాగిపోతూ "ఏందమ్మో! ఈ ఏలప్పుడు రథం ముగ్గు ఏస్తుండావు!" అంది.

"మనవరాలు అడిగింది. అందుకని వేస్తున్నా." వంగుని ముగ్గు వేస్తూనే సమాధానం చెప్పిందావిడ.

ఆవిడ తల ఎత్తలేదు. ఈవిడ నడకా ఆపలేదు. మేము మళ్ళీ చూసేసరికి గడ్డిమోపుతో సహా దారి మలుపులో కనుమరుగయిపోయింది.

మేము ముగ్గురం ఒకరి మొహాలు మరొకరం చూసుకుని ఫక్కున నవ్వుకున్నాం.

"ఈ గడ్డిమోపు పిల్లెవరో మన గౌరి కంటే ఫాస్ట్‌గా వుంది. ఏ సిటీలో పెరిగొచ్చిందో!" అన్నాను నేను.

నా చమత్కారానికి వాణి గలగలా నవ్వితే గౌరి ముసిముసిగా నవ్వింది.

"అయితే ఏమంటావే యిపుడు!" అంది గౌరి బుంగమూతితో చూస్తూ. "ఏమన్నా సందేహమొస్తే వెంటనే పైకి అడిగేయాలి. మనలో మనం ఆలోచించుకోకూడదు. అనా! అదేనా నువ్విపుడు నేర్చుకున్న పాఠం!" గదమాయించినట్లుగా అడిగింది.

"కాదు" అన్నాను నేను తల అడ్డంగా వూపుతూ. "లెక్కలూ, తర్కమూ ఎక్కువయ్యేకొద్దీ సద్వినియోగం చేసే శక్తి తగ్గుతుందేమోనన్న ఆలోచన.... అదీ నాకిపుడు కలిగినది."

ముగ్గురం మళ్ళీ కార్లో కూర్చున్నాం. సిటీలోకి ప్రవేశించగానే "చిక్కడపల్లి మీదగా వెళ్దాం. అమ్మని తీసుకుని వెళ్ళిపోవచ్చు." అంది వాణి.

"త్వరగా వెళ్ళాలే. పిల్లలెందుకో త్వరగా రమ్మని ఫోన్ చేశారు" అంది గౌరి. దాని కంఠంలో కొద్దిగా అసహనం ధ్వనించింది.

"సరే. మేమిక్కడ దిగుతాం. నువ్వెళ్ళిపో. మేము అమ్మని పికప్ చేసుకుని ఆటోలో వెళ్తాం." అంది వాణి.

'అయ్యో! అలా ఎందుకు! కలిసే వెళ్దాం.' అంటుందేమోననుకున్నాను. కానీ గౌరి వెంటనే "సరే, అయితే." అనేసింది.

మాయిద్దరినీ అక్కడ దింపేసి, తను వెళ్ళిపోయింది.

నేను యింటికి వచ్చేసరికి అయిదున్నర అయింది. సంధ్యాదీపం పెట్టి, కాసేపు ఏదో చదువుకుంటూ కూర్చున్నాను. పనంతా పూర్తి చేసుకుని పడుకునేసరికి పది. ఒక గంట నిద్ర పట్టిందో లేదో.... ఫోన్ మోగడంతో మెలకువ వచ్చింది.

వాణి!!

"ఏంటే!" అన్నాను నిద్ర మత్తులో నుంచి తేరుకుంటూ.

"ఏం లేదు, కాసేపు మాట్లాడచ్చా! నిద్రొస్తోందా!" అంది.

"లేదులే, చెప్పు." అన్నాను మంచం మీద సర్దుకుని కూర్చుంటూ.

"ఇపుడే గౌరితో మాట్లాడాను" అంది.

"ఊ." అన్నాను ఏం చెప్పబోతూందో వూహించడానికి ప్రయత్నిస్తూ.

"అమ్మకి చెప్తే అర్థం చేసుకోదే! మన ముగ్గురిదీ చాలా మంచి స్నేహమనీ, గౌరికి నేనంటే చాలా అభిమానమనీ.... ఇదే తెలుసు అమ్మకి. నేనూ వస్తానంటూ తయారయి కూర్చుంది. ప్రోగ్రాంలో చిన్న తేడా వచ్చినా గౌరికి నచ్చదని నాకు తెలుసు. కానీ ఆమాట చెప్తే అమ్మ వినిపించుకోదు." అంది.

"పోన్లే ఇపుడేమయింది!" అన్నాను నేను ఓదార్పుగా.

"అది కాదే, అంత స్నేహంగా వుండే గౌరి ఒక్క పది నిమిషాల కోసం చూసుకుని మనల్ని అలా రోడ్డు మీద వదిలేసి వెళ్ళిపోయింది కదా! ఎందుకు చెప్పు! కారణమేమిటి?"

ఏం చెప్పాలో అర్థం కాలేదు నాకు. నేను నోరు తెరిచేలోపల మళ్ళీ తనే "అది తెలుసుకుందామనే ప్రయత్నం చేశాను. నాకు కారణం అర్థమయింది." అంది.

"ఏం చేశావ్? ఏం తెలుసుకున్నావ్?" నేను ఆసక్తిగా అడిగాను.

"చెప్తాను. ముందు నువు సాయంత్రం నుంచీ ఏం చేశావో చెప్పు" అంది వాణి.

"నేనా! ఏముంది మామూలు పనులే."

"అదే. ఇంటికి వెళ్ళినప్పటినుంచి పడుకునేదాకా ఏం చేశావో వివరంగా చెప్పు."

"ఊ... ఇంటికొచ్చాను. ఇవాళ చేయాలనుకుని పొద్దున హడావుడి వల్ల చేయలేకపోయిన రెండు మూడు పనులు పూర్తి చేశాను. ఆ తర్వాత మామూలు పనులు, భోజనాలు అయ్యాక పాటలు వింటూ నిద్రపోయాను."

"గౌరి ఏం చేసిందో తెలుసా!"

"ఏం చేసింది!"

"ఇంటికి వెళ్ళగానే పిల్లలు సినిమాకి తీసుకు వెళ్ళమన్నారట. ఇవాళ కాదని వాళ్ళని అరుస్తుంటే, వాళ్ళాయన పిల్లల్ని వెనకేసుకు వచ్చి దాన్నేదో అన్నాడట. ఇక మాటా మాటా పెరిగి యిద్దరూ చాలా సేపు వాదించుకున్నారట. చివరికి అది కోపం వచ్చి వంట

చేయకుండా, అన్నం తినకుండా పడుకుందట. వాళ్ళ ఆయనా, పిల్లలూ బయటినుంచి ఏవో తెచ్చుకుని తిన్నారట."

నేను మౌనంగా వింటూ వుంటే వాణి చెప్పింది. "క్షణం క్షణం లెక్క పెట్టుకుంటావు కదే! నాలుగు గంటల పాటు పోట్లాడుతూ కూర్చున్నావా! అని నేను ఆశ్చర్యంగా అడిగితే.... 'ఏంటోనే, ఆయన అడ్డగోలుగా మాట్లాడితే నాకూ ఆవేశం వచ్చింది. పోట్లాడేశాను' అంది."

అక్కడిదాకా చెప్పి, నావైపు నుంచి ఏ స్పందనా లేకపోవడంతో, వాణి "హలో!" అంది.

"వింటున్నాను, చెప్పు" అన్నాను.

ఒక్క క్షణం నిశ్శబ్దం తర్వాత మెల్లగా చెప్పింది వాణి. "ఇవాళ పొద్దున్నుంచీ గౌరినీ, నిన్నూ గమనిస్తే నాకు కొన్ని ఆలోచనలు కలిగాయే. వాటిని పరీక్షించుకోవాలనుకున్నాను. గౌరి మనల్ని దింపి వెళ్ళి పోతున్నపుడు అనిపించింది, ఇవాళ సాయంత్రం ఆరు నుండి పది వరకూ.... నాలుగు గంటల సేపు మీరేం చేశారో తెలుసుకుని విశ్లేషించాలని. మీకు ముందుగా చెప్పకుండా, పది దాటాక ఫోన్ చేయాలనుకున్నాను.

గౌరికి ఫోన్ చేయగానే, అది నాలుగు గంటల సమయాన్ని ఎలా వేస్ట్ చేసిందో చెప్పింది. అపుడు నాకర్థమయింది. అది సమయాన్నంతా ఎవరికీ యివ్వకుండా దాచుకోవడానికి కారణమైన గుణమేమిటో నాకర్థమయింది.

'లోభం'. మనకి బాగా తెలిసిన గుణమే. చిన్నప్పటినుంచీ పెద్దవాళ్ళు కథలు కథలుగా చెప్పిన గుణమే. కానీ తమాషా ఏమిటంటే, ఆ గుణాన్ని వదిలించుకోవడం కాదు... కనీసం అది మనలో వుందని గుర్తు కూడా పట్టలేనంత మాయలో పడిపోయామిపుడు. పైగా దాన్నో గొప్ప ప్రజ్ఞలా, విజ్ఞానంలా భావిస్తున్నాం.

ఇవాళ నాకు అర్థమయింది. దేన్నైనా కూడబెట్టే ఉద్దేశ్యం మనకి కలిగిందంటే, యిక అది సద్వినియోగం కాదు. ఎవరికీ యివ్వకుండా దాచుకున్నదేదీ మనకీ మిగలదు.

గౌరితో మాట్లాడాక నాకా విషయం అర్థమయింది. నీతో మాట్లాడాక అది యింకా స్పష్టమయింది.

చూడు. ఈరోజు నీకు నువు మామూలుగా చేసుకునే పనులన్నీ అయ్యాయి. గుడి దగ్గరా... రిసార్ట్‌లో మాతో గడిపిన సమయం అదనపు ఆనందాన్నిచ్చింది. ఇదంతా కాకుండా నాకోసం, అమ్మకోసం కేటాయించేందుకూ నీదగ్గర సమయం మిగిలింది."

నేను చిన్నగా నవ్వాను దాని సుదీర్ఘ విశ్లేషణకి.

"ఎందుకు నవ్వుతున్నావు? నేను చెప్పింది తప్పా!" అంది వాణి.

"కాదులే" అన్నాను.

"ఏమో నాకయితే ఈ విషయం చాలా స్పష్టంగా అర్థమయిందనిపిస్తోంది. నువ్వూ ఆలోచించి చూడు."

అది గుడ్ నైట్ చెప్పి ఫోన్ పెట్టేసింది. నేను కూడా ఫోన్ ప్రక్కన పెట్టి, దిళ్ళు సరి చేసుకుని పడుకున్నాను.

పారిజాతం పూల పరిమళాలు మోసుకుంటూ లోపలికి వచ్చిన చల్లటి గాలిని గుండెల నిండా పీలుస్తూ "నిజమే, డబ్బే కాదు, డబ్బుగా భావించి కూడబెట్టిన దేనినీ కట్టుకుపోలేం" అనుకున్నాను.

**- జాగృతి**

*12 డిసెంబరు 2011*